

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో మైనింగ్ జోన్ బాధిత రైతులు

మల్‌రెడ్డిని కలిసిన మైనింగ్ జోన్ బాధితులు

● పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల సర్వే నంబర్ 268లోని మైనింగ్ జోన్ బాధిత రైతులు శనివారం తాజా మాజీ సర్పంచ్ కవాడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. కొన్ని ఏళ్లుగా ఎదురుచూస్తున్న నష్ట పరిహారం డబ్బులను ఇప్పించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. వెంటనే ఎమ్మెల్యే ఫైనాన్స్ సెక్రెటరీతో ఫోన్‌లో మాట్లాడి పరిహారం డబ్బుల విడుదలలో ఆలస్యానికి గల కారణాలను అగిడి తెలుసుకున్నారు. జిల్లా మంత్రితో మాట్లాడి త్వరలోనే పరిహారం డబ్బులు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పినట్లు మాజీ సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్, కొత్త అరుణ్‌కుమార్‌గౌడ్, శివరామకృష్ణ, శివశంకర్, బలరాం, అర్జున్, రైతులు మైసయ్య, లక్ష్మణ్, మధు, నర్సింగ్‌రావు, నందు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శంకుస్థాపన



కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట : చంపాపేట డివిజన్ డిఫెన్స్‌కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.85లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు శనివారం కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కమ్యూనిటీహాల్‌ను నాణ్యతగా సకాలంలో నిర్మించాలని కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులను కోరారు. కార్యక్రమం లో కాలనీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మేక సురేందర్ రెడ్డి, కాలనీ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, బాలరాజుగౌడ్, ప్రభాకర్‌రావు, వెంకటేశ్వర్ రావు, వైవిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతర్గత దారులకు మరమ్మతులు చేపట్టాలి



అంతర్గత దారులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో డ్రైనేజీ పైపుల నిర్మాణ పనుల కోసం తవ్వేసిన అంతర్గత దారులకు మరమ్మతులు చేపట్టాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులను ఆదేశించారు. శనివారం కొత్తపేట గ్రామం లో ఆయన పర్యటించి తవ్వేసిన అంతర్గత దారులను పరిశీలించారు. నూతన పైప్‌లైన్లు వేసినపుడు అంతర్గత దారులను తవ్వేసి మట్టితో గుంతలను పూడ్చారని దీంతో ప్రజలు ఈ దారుల్లో నడవలేకపోతున్నారని స్థానికులు ఆయనకు విన్నవించారు. అంతర్గత దారుల్లో ప్యాచ్‌వర్క్ చేపట్టేలా చర్యలు తీసుకుంటామని పవన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రతినిధులు మహేందర్‌యాదవ్, గోపాల్, నాయకులు సుందర్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల అందజేత

చంపాపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ముడుపు రాంరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటనర్సింహారెడ్డి, నాయకులు రవిముదిరాజ్, రోజారెడ్డి, ఉమామహేశ్వర్, మల్లేష్‌గౌడ్, బొంబాయి, చీర తిరుమలేష్, శివగౌడ్, జగదీష్‌గౌడ్, గౌరీదేవి రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.4.19 కోట్లు మంజూరు

● జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్‌లోని వివిధ కాలనీల్లో అభివృద్ధి పనుల కోసం రూ.4.19 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం మన్సూరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పోయిన తర్వాత అధికారులకు స్వేచ్ఛ వచ్చిందని, తమ లాంటి కార్పొరేటర్లు నేరుగా వెళ్లి ప్రజా సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసుకునే వెసులుబాటు వచ్చిందన్నారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని రెండు రోజుల పాటు నిర్వహించుకోగలిగామని, గత కేసీఆర్ పాలనలో కౌన్సిల్ సమావేశాలు కూడా నిర్వహించుకునే వీలులేకుండా నియంతృత్వంగా వ్యవహరించారన్నారు. నిధుల మంజూరునకు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, మేయర్ గద్వాల విజయలక్ష్మి సహకరించారని వివరించారు.

శిథిలావస్థలో ఉన్న నీటిట్యాంక్‌ను కూల్చివేయాలి



శిథిలావస్థలో ఉన్న నీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను వెంటనే కూల్చివేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు. న్యూమారుతినగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న 30 సంవత్సరాల నాటి వాడుకలో లేని శిథిలావస్థకు చేరిన మంచినీటి ట్యాంక్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ప్రమాదకరంగా మారిన సదరు ట్యాంక్ తొలగింపునకు చర్యలు చేపట్టాలని ఆలయ నిర్వాహకులు రాంరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై ఆరు నెలల క్రితమే రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు రాంరెడ్డి వెల్లడించారు. ఈ విషయమై జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లేశం, కార్యదర్శి కామేశ్వరరావు, ఆలయ వైస్ చైర్మన్ వి.మురళీధర్‌రావు, గోపాలకృష్ణమూర్తి, కృష్ణమూర్తి, కాంగ్రెస్ నేతలు సురేందర్‌రెడ్డి, మంజులరెడ్డి, బాబు, శరత్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి



జలమండలి అధికారికి వినతి పత్రం అందజేస్తున్న శివారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చిందని, సమస్య పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ బడంగ్‌పేట్ శాఖ ఉపాధ్యక్షుడు ఎం.శివారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం సాహెబ్‌నగర్ రిజర్వాయర్‌లోని జలమండలి కార్యాలయంలో అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి రాకముందే సమస్య తీవ్రతరమైనందున ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ బీసీ మోర్చా అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, పలు కాలనీల ప్రతినిధులు వెంకటేశ్‌గౌడ్, ప్రసాద్‌రెడ్డి, కృష్ణాగౌడ్, జగదీశ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజయ్‌కుమార్, విజయ్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల అడ్డా

● ఎంతోమంది పేదలకు జీవనోపాధి
● చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం

మాసబ్ చెరువు కట్ట



కొబ్బరి బోండాల దుకాణం



పుదీనా జ్యూస్ దుకాణం

హయత్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మాసబ్ చెరువు కట్ట ఎంతోమంది పేదలకు జీవనోపాధి కల్పిస్తుంది. చెరువు కట్టకు ఒక పక్క ఆహ్లాదాన్ని పంచే హెచ్ఎండీఏ పార్కు, పెద్ద చెరువు, పచ్చిక బయళ్లు, మధ్య వాకింగ్ ట్రాక్, కూర్చోవడానికి రాతి బల్లలు, కట్ట మైసమ్మ ఆలయం, బాటసారులను, ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. మాసబ్ చెరువు కట్టపై దాదాపు కిలోమీటర్ మేర వివిధ రకాల వస్తువులు, తినుబండారాలు, శీతల పానీయాలు, తాటి ముంజలు, వస్త్ర దుకాణాలు, తాటి బెల్లం, తాటి కల్లు, మామిడి పండ్లు, శానిటైజర్, బెల్టులు, పర్సులు, సెల్‌ఫోన్ స్టిక్స్, సెల్‌ఫోన్ స్క్రీన్ గార్డులు, ఫర్నిచర్, భోజనం, నిమ్మ, చెరుకు రసం, పుదీనా మజ్జిగ, ఐస్‌క్రీం, మిర్చి బజ్జి లాంటి చిరు వ్యాపారాలను ఏర్పాటుచేశారు. సుమారు 50 మంది వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం దాదాపు కోటి రూపాయలతో హెచ్ఎండీఏ మాసబ్ చెరువు కట్టపై సుందరీకరణ పనులు చేపట్టింది. ప్రకృతి ప్రేమికులు, బాటసారులు, యువతీ, యువకులు ఇక్కడికి వస్తున్నారు. సాయంత్రం సమీప కాలనీలు, గ్రామాల ప్రజలు పిల్లలతో వస్తుంటారు. ఐస్ క్రీం తింటూ కాలక్షేపం చేసి వెళుతున్నారు. ఇబ్రహీంపట్నం, మాల్, మల్లేపల్లి, దేవరకొండ ప్రాంతాలకు ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు, వచ్చే వారు ఇక్కడ కొంతసేపు ఆగి చెట్ల నీడన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ప్రేమికులు కూడా వస్తున్నారు. దీంతో చెరువు కట్టపైన చిరు వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతోంది. చాలామంది వ్యాపారులతో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి మాట్లాడగా రోజుకు సుమారు రూ. 500 నుంచి రూ. 1000 వరకు సంపాదిస్తున్నట్లు చెప్పారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి ఇబ్బందులు పెట్టకపోవడంతో వ్యాపారం సజావుగా సాగుతోందని పలువురు వ్యాపారులు తెలిపారు. నాగార్జునసాగర్ వైపు నుంచి నగరానికి వచ్చే వారు చెరువు కట్టపై ఆగి పార్కులో కొంత సేపు సేదతీరుతున్నారు. కొంతమంది వ్యాపారులు సాయంత్రం ఆరు గంటల వరకు, మరికొందరు రాత్రి 9 గంటల వరకు ఉంటున్నారు.



నిమ్మకాయ సోడా దుకాణం



చెరుకు రసం దుకాణం



చిన్నపిల్లలకు చెందిన బొమ్మల షాపు

వేధింపులకు గురయ్యే మహిళలకు షీటీం 'అండ'

● రాచకొండ మహిళా రక్షణ విభాగం, షీటీం డీసీపీ ఉషా విశ్వనాథ్
● 15 రోజుల్లో 120 మంది ఆకతాయిలను పట్టుకున్న షీ టీం

కొత్తపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వేధింపులకు గురయ్యే మహిళలకు రాచకొండ షీటీం అండగా ఉంటుందని రాచకొండ మహిళా రక్షణ విభాగం, షీ టీం డీసీపీ ఉషా విశ్వనాథ్ భరోసానిచ్చారు. మైనర్లు వేధిస్తే జువెనైల్ హోంకు తరలిస్తున్నాం అన్నారు. గత నెల 1వ తేదీ నుంచి ఈ నెల 15వ తేదీ వరకు అందిన 135 ఫిర్యాదుల ఆధారంగా షీ టీం రంగంలోకి దిగి 120 మంది ఆకతాయిలను పట్టుకుందన్నారు. ఎల్బీనగర్ సీపీ క్యాంపు కార్యాలయం వద్ద షీ టీం కార్యాలయంలో శనివారం ఆకతాయిలకు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, కౌన్సెలింగ్ నిపుణులు నిందితులతో మాట్లాడారు.

ఆకతాయిల్లో 61 మంది మేజర్లు, 59 మంది మైనర్లు

రాచకొండ షీటీం పట్టుకున్న 120 మంది ఆకతాయిల్లో 61 మంది మేజర్లు, 59 మంది మైనర్లు ఉన్నారు. వాట్సప్ కాల్స్, మెసేజీల ద్వారా మహిళలను



మాట్లాడుతున్న షీటీం ఏసీపీ వెంకటేశం

వేధించిన ఫిర్యాదులు 36, ఫోన్ల ద్వారా వేధించినవి 14, నేరుగా ఇబ్బంది పెట్టినవి 76, సోషల్ మీడియా యాప్స్ ద్వారా అసహ్యంగా ప్రవర్తించినవి 9 ఉన్నాయి. నిందితులపై 6 క్రిమినల్ కేసులు, 60 పెట్టీ కేసులు, 59 కౌన్సెలింగ్ కేసులు నమోదయ్యాయి. కొన్ని కేసులను డీసీపీ వివరించారు. ఆకతాయిలను పట్టుకుని మహిళలకు అండగా నిలుస్తున్న షీ టీంను రాచకొండ సీపీ తరుణ్‌జోషి అభినందించారు.

మార్ఫింగ్ చేసిన ఫొటోలతో సహోద్యోగి వేధింపులు

ప్రైవేటు కంపెనీలో పనిచేసే మహిళను సహోద్యోగి ప్రేమించాలని, శారీరకంగా కలవాలని వేధించాడు. ఆమెకు తెలియకుండా ఫొటోలు తీసుకుని మార్ఫింగ్ చేసి తాను చెప్పినట్లు చేయకపోతే వాటిని కుటుంబ సభ్యులకు, భర్తకూ పంపిస్తానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదుతో కుషాయిగూడ షీ టీం రంగంలోకి దిగి నిందితుడిని నేరెడ్‌మెట్ పోలీసులకు అప్పగించి, జైలు శిక్ష పడేలా చేశాయి. అదేవిధంగా ఎల్బీనగర్‌లో ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మరిదిని షీ టీం పట్టుకుని స్టేషన్‌లో అప్పగించాయి. విచారణ తర్వాత నిందితుడిని కటకటాల్లోకి నెట్టారు. వనస్థలిపురంలో ఓ మైనర్‌ను ప్రేమించాలని వెంటబడి వేధించిన బాలుడిని షీ టీం స్థానిక పోలీసులు జువెనైల్ హోంకు తరలించారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయండి

బాలికలు, యువతులు, గృహిణులు భయం వీడి నిర్భయంగా ఫిర్యాదు చేయండి. బాధితులు షీ టీం వాట్సప్ నెం. 8712662111 ద్వారా ఫిర్యాదు చేయాలి. భువనగిరి ప్రాంతంలో బాధితురాళ్లు 8712662598, చౌటుప్పల్ పరిధిలో 8712662599, ఇబ్రహీంపట్నం పరిధిలో 8712662600, కుషాయిగూడ పరిధిలో 8712662601, ఎల్బీనగర్ పరిధిలో 8712662602, మల్కాజిగిరి పరిధిలో 8712662603, వనస్థలిపురం పరిధిలో 8712662604 నెం. ద్వారా షీటీంకు ఫిర్యాదు చేయవచ్చు. వేధింపులకు గురయ్యే మహిళలకు షీటీం న్యాయం చేస్తది.

- టీ ఉషావిశ్వనాథ్, డీసీపీ, ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీం, రాచకొండ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం

ఉచిత రక్తదాన శిబిరం

ఎల్బీనగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లోని మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో శనివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఎంతో విలువైన ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అనంతరం పుల్వామ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వీరుల త్యాగాలను గుర్తు చేసుకుని నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గంగుల గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ సత్యం, అధ్యాపకులు డాక్టర్ శ్రీలక్ష్మి, సుధ, దేవి, మూర్తి, విద్యార్థులు, ఉస్మానియా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా రమాదేవి



అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షురాలిగా అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన సీనియర్ నాయకురాలు బొడిగె రమాదేవిరవీందర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి శనివారం రమాదేవికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమాదేవిరవీందర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ఎదిగిన తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్‌తో పాటు పలువురికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కవిత అరెస్ట్ అక్రమం, కుట్రపూరితం

● ఎమ్మెల్సీ దయానంద్



ఆందోళన చేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్, నాయకులు

మన్సూరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అక్రమమని, కక్షసాధింపులో భాగంగానే ఆమెను అరెస్ట్ చేయించారని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ విమర్శించారు. కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు శనివారం ఎల్బీనగర్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హాజరైన దయానంద్ మాట్లాడుతూ సుప్రీంకోర్టులో కవిత విచారణ కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ కుట్రపూరితంగా ఈడీ అరెస్ట్ చేయటం కక్షసాధింపు చర్యేనని విమర్శించారు. రాజకీయంగా కేసీఆర్‌ను ఎదుర్కొనే ధైర్యంలేక మహిళా నేత అయిన కవితను అరెస్ట్ చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, భవానీ ప్రవీణ్, సామ తిరుమల్‌రెడ్డి, నాయకులు గజ్జెల మధుసూదన్ రెడ్డి, ఉదయ్‌గౌడ్, రాంకోటి, సత్యంచారి, తూర్పాటి చిరంజీవి, రంగేశ్వరినాయుడు, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఐఎస్‌సదన్ చౌరస్తాలో..

సైదాబాద్: ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ ఐఎస్‌సదన్ చౌరస్తాలో శనివారం మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. బీఆర్ఎస్‌ను మానసికంగా దెబ్బతీయాలనే ఆలోచనతో కుట్రపన్నుతున్నారని ఆమె ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్ రాజ్, శ్రీనివాస్, నర్సింగరావు, సద్దాం పాల్గొన్నారు.

అల్మాస్‌గూడ ప్రభుత్వభూమిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

● పలు పశువులకు గాయాలు
● రైతుల ఆగ్రహం




రెవెన్యూ అధికారులు కూల్చేసిన పశువుల దొడ్లు

సరూర్‌నగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలంలోని అల్మాస్‌గూడ రెవెన్యూ సర్వే నంబర్.86లోని అక్రమంగా నిర్మించిన షెడ్లను శనివారం తెల్లవారు జామున రెవెన్యూ అధికారులు కూల్చేశారు. ఇక్కడ నాలుగు దశాబ్దాలుగా స్థానిక రైతులు వ్యవసాయం చేసుకుంటూ, తాత్కాలిక షెడ్లు(పశువుల దొడ్లు) నిర్మించుకుని వాటిలో గేదెలను పోషిస్తున్నారు. కాగా సదరు నిర్మాణాలపై స్థానికులు కొందరు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు శనివారం చర్యలు తీసుకున్నారు. మూడు ఎక్స్‌కవేటర్ల సాయంతో మీర్‌పేట్ పోలీసుల బందోబస్తు మధ్య పలు రైతు కుటుంబాలకు చెందిన పశువుల దొడ్లను నేల మట్టం చేశారు. విషయం తెలుసుకున్న రైతులు అక్కడకు వచ్చి అడ్డుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దూరంగా నెట్టేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మూగ జీవాలపై అధికారుల ప్రతాపం

సాధారణంగా మనుషులుగానీ, మూగ జీవులుగానీ నివాసం ఉంటున్న ఇళ్లను/షెడ్లను కూల్చేయాలంటే మానవతాదృక్పథంతో వ్యవహరించాల్సి ఉంటుంది. వారికి నోటీసులు ఇచ్చి తమంత తాముగా తొలగించుకోవడానికి అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే బాలాపూర్ రెవెన్యూ అధికారులు మాత్రం ఇక్కడ ఆనవాయితీకి విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు వినవస్తున్నాయి. అన్ని షెడ్లలో పాడి గేదెలు, ఇతర మూగ జీవాలు ఉన్నప్పటికీ నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారని, దాంతో పలు పశువులు గాయాలపాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పాలిచ్చే గేదెలపై అధికారులు ప్రతాపం చూపారని, ఇదెంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. తాము నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ వ్యవసాయం చేసుకుంటున్నామని, పశువులకు రక్షణగా షెడ్లు నిర్మించుకుంటే కూడా నేరమేనా అని వారు ఆవేదన వెలిబుచ్చారు. కాగా తాము పశువులను బయటకు పంపించి కూల్చివేతలు చేపట్టామని అధికారులు చెబుతుండగా, అసలు తమ పశువులను తమ అనుమతి లేకుండా వాటి మెడలోని తాళ్లు, గొలుసులు తొలగించి దొడ్లలో నుంచి బయటకు పంపించడం ఎంత వరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రాజీమార్గమే రాజమార్గం : శశిధర్‌రెడ్డి



లోక్‌అదాలత్‌లో జిల్లా న్యాయాధికారి శశిధర్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గమని రంగారెడ్డి జిల్లా న్యాయాధికారి శశిధర్‌రెడ్డి అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టుల ప్రాంగణాలలో శనివారం 33 లోక్ అదాలత్ బెంచిలు ఏర్పాటు చేశారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, వినియోగదారుల కోర్టు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించబడ్డాయి. మోటారు వాహనాల కేసులకు సంబంధించి రూ. 5,40,000 బాధితులకు అందజేశారు. జిల్లాలో మొత్తం 15,00,000 కేసులు పరిష్కరించి రూ.6,25,00,753ల నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించారు. ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు, దరఖాస్తు దారులు, బ్యాంకు మేనేజర్లు, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

హయత్‌నగర్ కోర్టులో 4467 కేసులు రాజీ

హయత్‌నగర్ : హయత్‌నగర్‌లోని 14వ అదనపు కోర్టు ప్రాంగణంలో శనివారం జడ్జి సల్మా ఫాతిమా అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హయత్‌నగర్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని కక్షిదారులు 4,467 కేసుల్లో రాజీ కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి సరళాకుమారి, అదనపు జడ్జి సంకేత్ మిత్ర, ఏపీపీ అరుణోదయకుమార్, నూతన్, బెంచ్ మెంబర్లు కోటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామ్మోహన్, హేమంత్ ప్రవీణ్‌కుమార్, సతీష్‌రాజ్ పాల్గొన్నారు.



పీఆర్‌సీ చైర్మన్ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించండి

● పీఆర్‌సీ చైర్మన్‌కు ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ వినతి

చాదర్‌ఘాట్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుమోహన్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం పీఆర్‌సీ చైర్మన్ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. అసోసియేషన్ సెక్రెటరీ జనరల్ వినయ్‌కుమార్, కోశాధికారి జీఎస్ ప్రసాద్‌రావు, దామోదర్, వెంకటేశ్వర్లు తదితరులు చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ శివశంకర్ ఏప్రిల్ మాసంలో ప్రత్యేకంగా పెన్షనర్ల సమస్యలపై దృష్టి సారించేందుకు సమావేశమవుతానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

గంజాయి పట్టివేత

అబ్దుల్లాపూర్‌మెట్ : హైదరాబాద్ నగర శివారు పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద భారీగా గంజాయిని పట్టుకున్నట్లు సమాచారం. నార్కోటిక్స్, రాచకొండ పోలీసులు సంయుక్తంగా రాజమండ్రి నుంచి ఐచర్ వాహనంలో తరలిస్తున్న సుమారు 500-600 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నార్కోటిక్స్ పోలీసులు గంజాయిని తరలిస్తున్న డీసీఎంను పట్టుకున్నారు. డీసీఎంతో పాటు గంజాయి సంచులను, డీసీఎం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే గంజాయిని ఎక్కడి నుంచి తీసుకొస్తున్నా రు, ఎక్కడికి తరలిస్తున్నారు అనే విషయాలు తెలియాల్సి ఉంది.

ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు సీఏలో చేరేందుకు అర్హులు

చాదర్‌ఘాట్ : ఇంటర్‌లో ఎంఈసీతోపాటు ఏ కోర్సు పూర్తి చేసినా, డిగ్రీ చదివిన విద్యార్థులు సీఏ కోర్సులో చేరేందుకు అర్హులని దిల్‌సుఖ్‌నగర్‌లోని మాస్టర్ మైండ్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీఆర్ తెలిపారు. మేలో దేశవ్యాప్తంగా సీఏ పరీక్షలకు 4.36లక్షల మంది హాజరవుతున్నారని ఇటీవల ఐసీఏఐ కౌన్సిల్ సభ్యులు సీఏ.రోహిత్ అగర్వాల్ చేసిన ప్రకటనను ఆయన గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఇన్ని లక్షల మంది సీఏ ఫౌండేషన్, సీఏ ఇంటర్, సీఏ ఫైనల్ పరీక్షలకు హాజరుకానున్న దేశ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టమని ఆయన వివరించారు.

వివాహిత అదృశ్యం



జవహర్‌నగర్, మార్చి, 16 (ఆంధ్రజ్యోతి): జలమండలి కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఉద్యోగిని స్నేహితులను కలిసి వస్తా అని సోదరుడికి చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాని సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌లో నివాసం ఉంటున్న ధనలక్ష్మి (47) జలమండలి కార్యాలయంలో అటెండ్‌గా పనిచేస్తుంది. గతంలోనే భర్త, కుమారుడు మరణించారు. ఉన్న ఒక్క కూతురు వివాహం చేయడంతో వాళ్లు చిక్కడపల్లిలో ఉంటున్నారు. ఈనెల 10న తన స్నేహితులను కలిసి వస్తా అని వెళ్లిన ధనలక్ష్మి తిరిగి ఇంటికి రాకపోవడంతో సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ధనలక్ష్మికి కల్లుతాగే అలవాటు ఉండటంతో గతంలో కూడా వెళ్లి రెండు రోజుల అనంతరం ఇంటికి చేరుకుందని ఈసారి తిరిగి ఇంటికి రాకపోవడంతో సోదరుడు టమటా గగన్‌సింగ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉరేసుకుని హాస్టల్ నిర్వాహకుడి బలవన్మరణం

రాయదుర్గం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలో హాస్టల్ నిర్వాహకులు తన హాస్టల్ గదిలో శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ అంజనేయులు తెలిపారు. ఎర్రంశెట్టి పాలెం పి.గన్నవరం మండలం, అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఎం.దుర్గాప్రసాద్(29) గచ్చిబౌలిలో 11 నెలలుగా సిరిదుర్గామెన్స్ హాస్టల్‌ను నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా ఇంటి యజమానితో అద్దె విషయంలో గొడవలు జరుగుతున్నాయని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో దుర్గాప్రసాద్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంపై అతని బావ శ్రీనివాస్ గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదైంది.